# నాన్న మసలిన కోనలో...

ఆంధ్రజ్యోతి వీక్లీ



ఒక్కోసారి జీవితంలో చిన్నచిన్న ఆశయాలు నెరవేర్చుకోవాలన్నా సంవత్సరాల తరబడి ఎదురుచూడవలసి ఉంటుంది.

మామయ్య మనసులో కూడా చిరకాలంగా తిష్ఠవేసుకున్న జీవితాశయం లాంటి కోరిక ఇంతకాలానికి– ఇప్పుడు నెరవేరబోతోంది. అందుకేలాగుంది... అంత ఆనందం!

కాని, ఈ సంతోషమంతా కేవలం మామయ్య వ్యక్తిగత ఆనందమే అయింది. ఎందుకంటే ఆయన తీసుకున్న నిర్ణయం అటు మా అత్తయ్యకుగాని, ఇటు పిల్లలకుగాని నచ్చలేదు. అది మామయ్య పట్టించుకోలేదు.

ఇంతకాలం పరిస్థితులకు సరిపడి గడిపారు. భార్యను సాధించలేక, పిల్లల చదువులను దృష్టిలో ఉంచుకొని, తన ఉద్యోగ బాధ్యతల మూలంగా తప్పనిసరిగా అజ్ఞాతవాసం చేయవలసి వచ్చింది. ఇక ఇప్పుడు ఎవరికిష్టం వున్నా, లేకపోయినా తన సొంత ఊరికి వెళ్లి అక్కడ స్థిరపడాలనే పట్టుదలతో ఉన్నాడు.

ఆయన ఆ విషయం ఎప్పుడో మర్చిపోయాడని భావించిన భార్య ఆశ్చర్యపోయింది.

"మీరు వస్తే రండి, లేకపోతే లేదు! నేను మాత్రం నా వేంద్ర అగ్రహారం వెళ్లితీరుతాను. అంతేకాదు... అక్కడే నా రిటైర్డ్ లైఫ్ గడపాలని నా ఆశ!"

వాళ్ళు అక్కడికి రావడానికి ఇష్టపడరని మామయ్యకి తెలుసు. సిటీలైఫ్‌కి బాగా అలవాటు పడిపోయారు. వాళ్ళకి ఆ మారుమూల పల్లె అంటే ఏమాత్రం కుతూహలం లేదు. ఎప్పుడన్నా శాస్త్రుల్లు మామయ్య ఊరి పేరు తలపెట్టినా, "అబ్బా... బోర్ డాడీ!" అంటారు. ఆ ఇంట్లో 'వేంద్ర అగ్రహారం'తో అటాచ్‌మెంట్, సెంటిమెంట్ ఉన్నది... ఒక్క మామయ్యకు మాత్రమే!

కానీ, మామయ్య తపన నాకు కాస్త అతిగా అనిపిస్తోంది. పుట్టిపెరిగిన ఊరంటే ఎవరికైనా కొద్దో, గొప్పో అభిమానం ఉంటుంది. అది సహజమే. కానీ, ఈ ఆపేక్ష మామయ్యలో మోతాదుకు మించి కాస్త విడ్డూర మనిపిస్తోంది. అయినా ఆయన నిర్ణయాన్ని మనసులో మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

ఇక్కడ మా వెంకటశాస్త్రి మామయ్యను గురించి కాస్త వివరంగా చెప్పాలి...

మా మాతామహులకు ఇద్దరు పిల్లలు. మా అమ్మ, మామయ్య! మా తాతగారు ఆ ఊరికి మకుటంలేని మహారాజు. సుమారు వెయ్యి గడపలున్న ఆ అగ్రహారానికి ఆయనే మునసబు-కరణం- ఊరిపెద్ద. ఆ విలేజ్‌కి కర్త- కర్మ- క్రియ... ఆయనే. నిస్వార్థంగా ఊరికోసం తాపత్రయపడేవారు. ఆయన ప్రేమాభిమానాల్ని చవిచూడని మనిషి ఆ పల్లెలో లేడని చెప్పవచ్చు. ఎవరికి ఏ కష్టమొచ్చినా అది తనదిగానే భావించి ఆదుకునే వారాయన. ఆయన గాంధేయవాది. ముతక ఖద్దరు, పంచ, జుబ్బాలతో అంత పెద్ద కామందు... సాదాసీదా మనిషిలా ఉండేవారు. అందుకే ఊరివాళ్ళందరూ ఆయన్నేదో భూస్వామిలా, ధనవంతునిలా కాకుండా- తమలో ఒకనిగా, సాటిమనిషిగా భావించేవారు.

ఆ ఊరికి, ఆయనకు అవినాభావ సంబంధం తరతరాలుగా వచ్చింది. ఆయన ఊరందరివాడూ, ఊరంతా ఆయనిది! కులాలు, మతాలు, వర్గభేదాలు ఆ అపురూపమైన సంబంధానికి ఏమాత్రం ఆటంకంగా ఉండేవి కావు. వాళ్ళ వ్యక్తిత్వ విశేషం- జీవిత విజయ రహస్యం.

ఆ ఊరిలో పిల్లలకు విద్యా సౌకర్యం, మంచి వైద్యసదుపాయం ఉండేవి కావు. ఐదవ తరగతి వరకూ వీధిబడి ఉండేది. హైస్కూలుకు వెళ్లాలంటే పది మైళ్లు పట్నం వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. ఊళ్లో ఆచారిగారు ఆయుర్వేద వైద్యం చేసేవారు. తప్పకపోతే పట్నానికి తీసుకెళ్లి పెద్దడాక్టరుకు చూపించుకునేవాళ్ళు.

మామయ్య కూడా అలాగే చదువుకున్నాడు. ఆయన ఎంతో తెలివైనవాడని పేరు తెచ్చుకున్నాడు. తాతయ్యంటే ఆయనకు ప్రత్యక్ష దైవమే. తల్లిదండ్రుల పట్ల అంతటి భక్తిభావం ఉండటం అరుదు.

మామయ్య తీరే వేరు. తాతయ్య మాట శిలాశాసనంలా ఎంచి పాటించేవాడు. తాతయ్య ఆయన్ని ఎంతో గొప్పవ్యక్తిని చెయ్యాలని కలలు కనేవాడు.

మామయ్య ఆయన ఆశయాల్ని నెరవేర్చాడు. ఉన్నత విద్య పూర్తిచేసి, మంచిఉద్యోగంలో స్థిరపడ్డాడు.

కాలక్రమంలో ఆ కుటుంబంలో ఎన్నో మార్పులు వచ్చాయి.

కొద్ది సంవత్సరాలలో అమ్మమ్మ, తాతయ్య చనిపోయారు. ఆయన మరణించాక తను పల్లెలో ఉండి తాతయ్య లేనిలోటును భర్తీ చెయ్యాలని ఆశపడ్డాడు మామయ్య. కానీ, అప్పటికే మంచి పొజిషన్‌లో ఉండటం వలన అత్తయ్య, పిల్లలు ఆయన్ని ఉద్యోగం వదులుకొని పల్లెలోకి వచ్చి వుండే ఆలోచనను వ్యతిరేకించారు. మామయ్య కూడా పరిస్థితులతో రాజీపడి తన ఆశయాల్ని పక్కన ఉంచేశారు.

ఇప్పుడు ఇన్నేళ్లకు మామయ్యకు స్వేచ్ఛ లభించింది.

ఉద్యోగ బరువు బాధ్యతల నుండి విముక్తుడయ్యాడు.

ఇక అతన్ని సిటీకి కట్టిపడేసిన బంధం ఏదీ లేదు.

"అందరూ నన్నో వెర్రివాడిలా చూస్తున్నారు. నా మనసుని ఎవరూ గ్రహించలేకపోతున్నారు. ఇంతకాలం ఉద్యోగమనీ, పిల్లల చదువులనీ ఎక్కడెక్కడో తిరిగాను. ఇకనైనా మన ఊరికెళ్లి అక్కడి ప్రజలకు చేతనైన సేవ చేసుకుంటూ ఉండాలని నా కోరిక! మా నాన్న ఆ ఊరిలో ఎంత ఆనందంగా, హాయిగా ఉన్నారో- నేనూ అలాగే అక్కడ గడపాలి. నాన్న మసలిన కోనలో నేనూ ఉండాలి. అక్కడే నేను కూడా గతించిపోవాలి!" మావయ్య మాటలలోని ఆర్తి తీవ్రత నన్ను కదిలించి వేసింది.

'జననీ జన్మభూమిశ్చ... స్వర్గాదపీ గరీయసీ' అన్నారు. అందుకేలాగుంది... 'కన్నతల్లి, పుట్టి పెరిగిన గడ్డ- స్వర్గాన్ని మించినవి' అంటారు. మొత్తానికి అన్ని అవరోధాలను అధిగమించి, ఎంతో వ్యతిరేకతను తట్టుకొని తన కోరిక నెరవేర్చుకున్నారు మామయ్య.

ఆ పల్లెలో మామయ్య రీ-సెటిల్‌మెంట్‌కి నేనూ తోడ్పడ్డాను.

మామయ్యకు, నాకూ మధ్య 15 సంవత్సరాల వయోభేదముంది. కాని, మామయ్య నాకో స్నేహితుడిలా కనిపిస్తాడు. మనిషి కరుకుగా, కఠినంగా అనిపించినా మనసులోని సున్నితత్వాన్ని గ్రహించటం వల్లనేమో... ఆయన నాకు సమవయస్కుడి వలె మిత్రుడిలా కనిపిస్తాడు. బాహ్య ప్రవర్తనను, ఆకారాన్ని బట్టి మనిషి అంతరంగాన్ని తెలుసుకోవడం కష్టం.

ఏమైనా శాస్త్రుల్లు మామయ్య కోరిక తీరినందుకు ఆయనతో పాటు నేనూ ఎంతో ఆనందించాను.

ముందు ఎంత వద్దన్నా అత్తయ్య కూడా ఆయన్ను అనుసరించి వచ్చింది. విదేశాల్లో చదువుకుంటున్న పిల్లలు ఇప్పట్లో వచ్చి ఆయనతో కలిసేది లేదు.

రెట్టించిన ఉత్సాహంతో మామయ్య పల్లెలో ప్రవేశించాడు.

లక్షలాది బ్యాంక్ బ్యాలెన్స్, మారుతికారు వగైరా హంగులతో దర్పంగా ఊళ్లో పునః ప్రవేశం చేశాడు. తాతయ్య అన్ని వందల ఎకరాల ఆసామి అయినా చాలా సాదాగా, సామాన్యుడిగా ఉండేవాడు.

కారులో తీవిగా ఇంటిముందు కారు ఆపి దిగిన మామయ్యను ఎవరూ ఎదురువచ్చి ఊరిలోకి ఆహ్వానించలేదు.

పెద్ద, చిన్న, ఆడా, మగా అంతా దూరంగా నిలబడి కారు అందాన్ని అబ్బురంగా చూశారే తప్ప- కారులోంచి దిగిన మామయ్యని పట్టించుకోలేదు.

"పంతులుగోరి అబ్బాయి లాగుంది!" అని యథాలాపంగా గొణుక్కుని మగవాళ్ళు తుండు దులిపి తలకు చుట్టి పనులకు పోయారు.

ఇది మామయ్యకు ఎదురైన మొదటి ఆశాభంగం!

"చాలా సంవత్సరాలైంది వచ్చి! మెల్లిగా పరిచయాలు పెంచుకోవాలి. చూశావుగా ప్రసాదూ... ఈ ఊరు ఒక్కడుగు కూడా ముందుకు పోలేదు. అప్పుడెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. స్కూలు లేదు, హాస్పిటల్ లేదు, పక్కా రోడ్లు లేవు. మనదేశంలో చాలా మారుమూల పల్లెలు ఎదుగూ, బొదుగూ లేకుండా ఇట్లాగే ఉండిపోతున్నాయి. ఈ ఊర్లో పుట్టిపెరిగిన వాళ్ళం... దీని బాగోగులు మనమైనా పట్టించుకోవాలి కదా... ఏమంటావు?"

నేను తల ఊపాను.

'మామయ్య ఈ ఊరికి చెయ్యవలసింది ఎంతో వుంది. కాని, ఆయన ఏమన్నా చెయ్యగలడా..?' అన్న అనుమానం నా మనసులో లేకపోలేదు.

నేను ఈతరం మనిషిని. ఈ కాలపు మనుషుల తీరుతెన్నులు, ఆలోచనా సరళి, ఆశలు- ఆశయాలు కొంతవరకు అర్థంచేసుకో గలను.

మామయ్య ఆశయాలు, ఆలోచనలు తాతయ్య కాలంలోనే ఆగిపోయాయి. కాలంతో మారిన సమాజాన్ని, మానవ మనస్తత్వాన్ని అందుకోలేక పోతున్నాడు. పల్లెలో ముదిరిన వర్గభేదాలు, కులమత వైషమ్యాలు, రాజకీయాలు... ఇవేమీ ఆయనకు పట్టినట్టు లేదు. ఇన్ని సంవత్సరాల తరువాత అకస్మాత్తుగా ఊళ్లో ప్రవేశించి అక్కడ పాతుకుపోయిన ఆధిపత్యాన్ని జయించి- తనేదో చేద్దామనుకోవడం ఎంత మటుకు సాధ్యం?

నేనీ మాటలు పైకి అనలేదు...

- అని మామయ్య మనసు నొప్పించడం నాకిష్టం లేదు.

ఆయన స్వచ్ఛమైన ఆశయంతో, ఆరోగ్యకరమైన, నిస్వార్థమైన, పరిహిత ఆలోచనలతో వచ్చాడు. ఒకనాటి తన తండ్రి స్థానాన్ని తను భర్తీ చెయ్యగలనన్న నమ్మకంతో ఉన్నాడు... చూద్దాం!

స్వంత ఖర్చులతో రోడ్లు బాగు చేయిద్దామంటే- ఆధిపత్యపు అడ్డంకి!

స్కూలు, కాలేజీల కొరకు ప్రపోజల్స్ తయారుచేస్తే- అదో రాజకీయం!

వైద్య సదుపాయం అంటే- మరో అడ్డంకి!

ఏది చేద్దామన్నా, ఏ మంచిపని సాధిద్దామన్నా- ఆ అగ్రహారంలో వేళ్లూనుకున్న ఆధిపత్యం అడ్డు తగలడం ఆయన సున్నిత మనస్సు తట్టుకోలేకపోయింది.

చివరికి అన్నపూర్ణకు నిలయమైన తన గోదావరి జిల్లాలు 'రొయ్యల చెరువు'ల పేరుతో పంటపొలాలు కనుమరుగవుతోంటే ఆయన తట్టుకోలేక ఎదురుతిరిగి ప్రజల్ని చైతన్యవంతం చేయతలపోస్తే... అక్కడా ఆశాభంగమే!

చివరికి తన పిత్రార్జితం ద్వారా సంక్రమించిన సుక్షేత్రమైన పొలాలు కూడా తన అనుమతి లేకుండా రొయ్యల సాగుకు గురవుతూంటే ప్రతిఘటించిన తనకు తన స్థిరాస్థి కూడా దక్కని దుస్థితి!

...ఇదంతా కాల మహిమ!

తన తండ్రి హయాంలోని వానపాములు ఈరోజు తనను త్రాచుపాములై కాటేయ ప్రయత్నిస్తోంటే... ఆయన తట్టుకోలేకపోతున్నాడు.

● ● ●

"నేను చెప్తే విన్నారు కాదు! 'నా ఊరు... నా ఊరు' అని ఆరాటపడిపోయారు. ఈ ఊరిని ఉద్ధరించెయ్యాలని వెర్రిపరుగులు తీశారు. ఈ ఊళ్లో ఉన్న రాజకీయం ఎక్కడా లేదు!" అత్తయ్య నన్ను చూడగానే కళ్ళనీళ్ల పర్యంతమైంది.

"మామయ్యకు ఎలా వుంది?"

సిటీలో పెద్దహాస్పిటల్‌లో మామయ్యను చేర్చారు...

ఇన్సెంటివ్ కేర్‌లో చికిత్స చేస్తున్నారు...

ఆయనకు రెండురోజుల క్రితం హార్ట్‌స్ట్రోక్ వచ్చింది. వెంటనే సిటీకి తరలించారు.

"ఈ ఊరు కొందరి స్వార్థపరుల చేతుల్లో ఉంది. వాళ్ళకు రాజకీయ పలుకుబడి ఉంది. అందుకని వాళ్ళకు భయపడి ఊరంతా వాళ్ళ చెప్పుచేతల్లో ఉంటుంది. అధిక లాభాల కోసం, పంటభూముల్ని రొయ్యల కయ్యలుగా మారుస్తోంటే వాళ్ళకి నచ్చచెప్పాలని చూశారు. బంగారం పండే పంటభూములు పాడు చెయ్యొద్దన్నారు. వాళ్ళు వినలేదు. మీ మామయ్య ఆశలన్నీ అడియాశలైపోయాయి!" అత్తయ్య కూడా మామయ్య మనసు అర్థంచేసుకున్నట్లుంది... ఆయన ఆశయ భంగానికి పడిన వేదన ఆమె కూడా అనుభవిస్తోంది.

అసలే పెద్ద వయసు! ఏ విధమైన ఆశాభంగాన్ని తట్టుకోలేని సున్నిత హృదయం శాస్త్రుల్లుగారిది. ఆయన స్థితి నాకు జాలి వేసింది. ఎందుకింత చాదస్తం? ఏమిటీ వెఱ్ఱి?

కాస్త ఆరోగ్యం కుదుటపడగానే మావయ్యను పల్లెనుంచి తీసుకుపోవాలని మేమంతా స్థిరంగా నిర్ణయించుకున్నాం.

మామయ్య బ్రతికి బయటపడ్డాడు.

కాస్త కోలుకున్నాక మేమంతా చుట్టుముట్టి 'బ్రైన్‌వాష్' చేశాం. ఆయనా ఫలించని ప్రయత్నాలతో విసిగిపోయినట్లున్నాడు– అనారోగ్యం మనిషిని కాస్త మెత్తపరిచింది– "సరే!" అన్నాడు.

"కానీ, ఒక షరతు మీదైతేనే..!" అన్నాడు.

"ఎవరికైనా మృత్యువు అనివార్యం! ముందే చెప్తున్నాను... నేను ఎక్కడ మరణించినా నా అంత్యక్రియలు మన వేంద్ర అగ్రహారంలోనే జరగాలి. మా నాన్న సమాధి పక్కనే నాకూ..!"

చలించిన భారమైన హృదయంతో... ఆయన స్మృతిపథం లోని– 'నాన్న మసలిన కోనలో' నేనూ లీనమైపోయాను.